దీపాలు వెలిగిస్తున్న భక్తులు

## కేతకిలో కార్తిక సందడి

ఝరాసంగం, నవంబర్ 4: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలమంలో కార్తికమాస సందడి ప్రారంభమైంది. మొదటి సోమవారం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు ఆలయ ఆవరణలోని అమృతగుండంలో స్నానాలు ఆచరించి గర్భగుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి కోడెలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ రాజగోపురం ఎదుట కోహీర్‌కు చెందిన దాత చిలికేపల్లి కృష్ణ మూర్తి కళావతమ్మ కుటుంబ సభ్యులు రూ.33 లక్షలతో షెడ్డు నిర్మిస్తున్నారు. గతంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తుల కోసం చలువ పందిళ్లు వేసేవారు. ఇప్పుడు ఈ షెడ్డు నిర్మాణంతో ఆ ఇక్కట్లు తీరనున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి శశిధర్, ఆలయ సిబ్బంది రమేశ్, విరన్న, బస్వరాజ్, సంగయ్య స్వామి, నాగేశ్, సంగమేశ్వర్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

హత్నూర: మాజీ సర్పంచ్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

నారాయణఖేడ్: మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

కోహీర్: కోహీర్‌లో మాజీ సర్పంచులను అరెస్ట్ చేసిన పోలీసులు

# మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

**పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ ■ హైదరాబాద్ బయలు దేరిన మాజీ సర్పంచ్‌లను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసిన పోలీసులు**

*చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన సచివాలయం ముట్టడిని పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్‌కు బయలుదేరుతున్న మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. తర్వాత సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేశామని, ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా సొంత డబ్బులు, అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేశామన్నారు. పదవి కాలం పూర్తయి సంవత్సరం కావస్తున్నా పెండింగ్ బిల్లులు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించడం లేదని ఆరోపించారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని అడుగుతుంటే అక్రమంగా తమను అరెస్టు చేయడం సరైంది కాదని మండిపడ్డారు.*

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 4*

గుమ్మడిదల: పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

జహీరాబాద్: మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్టు చేసి జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

ఝరాసంగం: హైదరాబాద్‌కు తరలిసన మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

## 12 అయినా పత్తాలేరు!

తహసీల్‌లో ఖాళీగా దర్శనమిస్తున కుర్చీలు

నాగల్‌గిద్ద, నవంబర్ 4: తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సమయపాలన పాటించకపోవడం ప్రజలకు శాపంగా మారింది. నాగల్‌గిద్ద తహసీల్దార్‌గా రమాదేవి విధులు సరిగా నిర్వహిస్తాలేరని విమర్శలు రావడంతో ఆమె సెలవులు పెట్టారు. రెండు మూడు రోజులకు ఇతర మండలాల నుంచి ఇన్‌చార్జిలుగా అక్కడి తహసీల్దార్లు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఎవరూ రాక పోవడంతో రిజిస్టేషన్ల కోసం, ఇతర పనుల కోసం వచ్చిన ప్రజలు పడిగాపులు కాశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గుర్తించి సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ మున్సిపల్ కార్మికులు

జహీరాబాద్, నవంబర్ 4: జహీరాబాద్ మున్సిపల్‌లో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్‌లో కాంట్రాక్టు కార్మికులు న్యాయపరంగా రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ బిల్లులను వెంటనే చెల్లించాలని, అలాగే పీఎఫ్ విత్‌డ్రాలో నెలకొన్న సమస్యలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. సీఐటీయూ నాయకులు కమయ్య, శ్రీనివాస్, మోహన్, చంటీ, కాంతమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

## సందడిగా సదర్

కోహీర్, నవంబర్ 4: మండలంలోని ఖానాపూర్‌లో గొల్లకురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా దున్నపోతులను అందంగా అలంకరించి ఉల్లాసంగా, ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎంజీ రాములు, రమేశ్‌బాబు, నాగన్న, సత్యనారాయణ, రాజు, మల్లేష్, శ్రీ నివాస్, నర్సింహులు, పాండు, నరేశ్, పవన్, వెంకటేశ్, అంజయ్య, నాగరాజు, మల్లు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ చిరుధాన్యాల సమైక్య సదస్సు

జహీరాబాద్, నవంబర్ 4: జాతీయ చిరుధాన్యాల సమైక్య సదస్సును రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ డెక్కన్ డెవలప్‌మెంట్ జాతీయ చిరుధాన్యాల సమైక్య ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం జహీరాబాద్ మండలంలోని దిడ్గి శివారులోని డీడీఎస్-కేవీకే విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు 4వ భారతీయ చిరు ధాన్యాల సమైక్య సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన 17 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సభ్యులు హాజరవుతారిని పేర్కొన్నారు. ఈ సదస్సు మంగళ, బుధవారాల్లో జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, జాతీయ చిరుధాన్యాల సమైక్య ప్రతినిధులు, సభ్యులు, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## స్విమ్మింగ్‌లో సంగారెడ్డి విద్యార్థి ప్రతిభ

విద్యార్థి రహీమాన్‌ను అభినందిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి, నవంబర్ 4: రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో సంగారెడ్డి విద్యార్థి మూడో స్థానంలో నిలవడంతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ విద్యార్థిని అభినందించారు. సోమవారం పట్టణంలోని శ్లోకాస్ శ్రీవాణి పాఠశాలకు చెందిన ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి మహమ్మద్ అబ్దుల్ రహీమాన్ సిద్దికీ హైదరాబాద్‌లో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో మూడో స్థానంలో నిలవడం జిల్లాకే గర్వ కారణమన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, డీఆర్‌వో పద్మజ, డీవైఎస్ఓ ఖాసీం బేగ్, టీఎన్జీవోస్ కార్యదర్శి రవి, అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కల్హేర్, నవంబర్ 4: ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని నారాయణఖేడ్ ఆర్డీవో అశోకచక్రవర్తి రైతులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని మహదేవుపల్లి శివారులో రైతులు ఆరబెట్టిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. తహసీల్దార్ శివ శ్రీనివాస్, ఆర్ఐ మల్లేషం, నాయకులు గోపాల్, తుకారాం, వీర్‌శెట్టి, నాగయ్య ఉన్నారు.

***జిన్నారంలో..***

జిన్నారం, నవంబర్ 4: మండలంలోని వావిలాల, జిన్నారం, ఊట్ల, సొలక్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ భిక్షపతి పరిశీలించారు. వరుస క్రమంలో ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

***హత్నూరలో..***

హత్నూర, నవంబర్ 4: ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మాధురి పరిశీలించారు. తేమశాతం, తూకం, రికార్డుల నమోదును పరిశీలించారు. కొనుగోలు కేంద్రం పరిశీలనకు ఐఏఎస్ అధికారుల బృందం వస్తుందని వచ్చిన సమాచారంతో గంటల తరబడి వేచిచూసినా రాకపోవడంతో పలు శాఖల అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

## లంబాడీలకు ప్రాధాన్యమివ్వాలి

మాట్లాడుతున్న జైపాల్ నాయక్

సంగారెడ్డి, నవంబర్ 4: రాష్ట్రంలో లంబాడాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, గిరిజనులను ప్రభుత్వం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నదని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ లంబాడాల జనాభా ప్రకారం అన్ని రంగాల్లో సమానవాటా దక్కాలని, రాజ్యాధికారంలో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు గిరిజనులకు సీట్లు కేటాయించాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గిరిజనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వకపోతే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పాండ్య నాయక్, మాజీ ఉప సర్పంచ్ నామానాయక్, రూప్‌సింగ్, జైసింగ్, రాజు, శీను, బాల్‌రాజ్, రంగలాల్, అనిల్, గణేశ్, సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్

సంగారెడ్డి, నవంబర్ 4: ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ కార్మికులు, ఉద్యోగులపై అధికారుల కక్షపూరిత వేధింపులు అపాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని ఆర్టీసీలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర ఉద్యోగులను డిపో మేనేజర్లు, సీఐలు కక్షపూరితంగా వేధిస్తూ మెమోలు ఇస్తూ ఏకపక్షంగా సస్పెన్షన్ సర్వీస్ రిమూవ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వీటిని వెంటనే అపాలని, లేదంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షులు శివకుమార్, మల్లేశం, సహాయ కార్యదర్శులు మహేశ్, జయకుమార్, సభ్యులు చంద్రశేఖర్, నరేశ్, గంగారం, మహేశ్ పాల్గొన్నారు.

## రైతుబజార్ పనులు పూర్తి చేయాలి

ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, నవంబర్ 4: మోడల్ రైతుబజార్ పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అధికారులను కోరారు. సోమవారం బొంబాయికాలనీలో నిర్మాణ దశలో ఉన్న మోడల్ రైతుబజార్, కమ్యూనిటీ హాల్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని బల్దియా అధికారులకు సూచించారు. అనంతరం బీడీఎల్, ఎల్ఐజీ రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో డీసీ సురేశ్, ఎస్ఈ శంకర్, ఈఈ సురేశ్, డీఈ నరేందర్, ఏఈ దివ్య, నాయకులు యాదగిరిరెడ్డి, లక్ష్మణ్, రాజలింగం, శామ్యూల్, కృష్ణగౌడ్ ఉన్నారు.

## ప్రతి ఉద్యోగికి బదిలీ సహజం

మండల వ్యవసాయ అధికారి అవినాష్‌వర్మకు వీడ్కోలు తెలుపుతున్న అధికారులు

రాయికోడ్, నవంబర్ 4: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సహజమేనని రాయికోడ్ ఏఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. రాయికోడ్ రైతు వేదికలో సోమవారం మండల వ్యవసాయ అధికారి అవినాష్‌వర్మకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. రాయికోడ్ వ్యవసాయ శాఖ డివిజన్ అధికారి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అవినాష్‌వర్మను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సమావేశంలో ఏవోలు మహేశ్‌చౌహన్, శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో యాదయ్య, సిబ్బంది రాజుకుమార్, తదితరులు ఉన్నారు.

## వీరభద్రుడికి ప్రత్యేక పూజలు

గుమ్మడిదల, నవంబర్ 4: మండలంలోని వీరన్నగూడెంలోని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో కార్తిక సోమవారం పూజలతో భక్తులు కిటకిటలాడారు. దైవదర్శనాల కోసం భక్తులు భారులు తీరారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా జాగ్రతలు తీసుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

## భూసర్వే చేయాలని వినతి

జిన్నారం, నవంబర్ 4: మండల కేంద్రం జిన్నారంలోని సర్వే నంబర్ 1, దానికి ఆనుకొని ఉన్న 58 సర్వే నంబర్‌ను సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 1లో మిషన్ భగీరథ ట్యాంక్, శివాలయం, హెచ్ఎండీఏ భూమిలోకి వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న సర్వేనంబర్ 58లో పట్టాదారు మా భూమి అంటూ కడీలు ఏర్పాటు చేశాడని కలెక్టర్‌కు తెలిపారు. గ్రామ ప్రజల సమక్షంలో రీ సర్వే చేసి వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు ప్రతాప్‌రెడ్డి, సింహారెడ్డి, మంద రమేశ్, రాజేందర్‌రెడ్డి, ఆనంద్, తదితరులు ఉన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నాగల్‌గిద్ద/అందోల్, నవంబర్ 4: మండల పరిధిలోని పుసల్‌పాడ్‌లోని విజయ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులకు పత్తి అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గుండురావ్‌పాటిల్, సచిన్ పాటిల్, సంతోష్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు. అందోల్ మండల పరిధిలోని ఏర్రారం రామకృష్ణ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మాధురి ప్రారంభించారు.



సూర్యుని చుట్టేసిన దట్టమైన పొగమంచు

బీదర్-జహీరాబాద్ రోడ్డులో కమ్ముకున్న పొగమంచు

## కమ్ముకున్న పొగమంచు

జహీరాబాద్, నవంబర్ 4: నియోజకవర్గంలో సోమవారం ఉదయం ప్రధాన రహదారులు, పంటపొలాలను పొగమంచు కమ్మేసింది. దట్టమైన మంచుదుప్పటి సూర్యుడిని సైతం చుట్టేసింది. జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లోని అల్లాదుర్గం-మెటల్‌కుంట, బీదర్-జహీరాబాద్, నారాయణఖేడ్, హైదరాబాద్-ముంబాయి, జహీరాబాద్-మొగుడంపల్లి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులను పొగమంచు కమ్మేసింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలకు లెట్లను వేసుకొని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. పంటపొలాలు, చెరువులు, నదుల చూట్టు కమ్ముకున్న మంచు తెరల అందాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

అల్లాదుర్గం-మెటల్‌కుంట ప్రధాన రహదారిపై కమ్మేసిన పొగమంచు

## బీఆర్ఎస్ నాయకుడి మృతిపై సంతాపం

జహీరాబాద్, నవంబర్ 7: న్యాల్‌కల్ మండలంలోని చాల్కి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఏసప్ప మృతిచెందడంపై జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సోమవారం ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావునివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు బండిమోహన్, అనంద్, ప్రకాష్, రమేశ్ ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

నారాయణఖేడ్, నవంబర్ 4: నారాయణఖేడ్ మండలం గైరాన్‌తండాకు చెందిన ఇస్లావత్ బిక్కు ఇటీవల మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఉపాధ్యాయుడు కాశీనాథ్ అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందిన విషయం తెలుసుకొని నారాయణఖేడ్‌లోకి ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు రవీందర్‌నాయక్, పార్మెట్టి సంగప్ప, రాజునాయక్, అభిషేక్ శెట్కార్, నగేశ్, అబ్బుపటేల్, నారాయణ ఉన్నారు.

## పైప్‌లైన్ వదిలి నిర్మాణం చేపట్టాలి

హత్నూర, నవంబర్ 4: శ్రీరామ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ వదిలి పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ మండలంలోని పల్వనూర్, బోర్పట్ల గ్రామాల రైతులు సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరామ ఎత్తిపోతలతో సుమారు 350ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఈ పైప్‌లైన్ సర్వే నంబర్ 291లో ఉండగా శ్రీవైష్ణవి మైన్స్ అండ్ మినరల్స్ పరిశ్రమ నిర్మాణ పనులు అందులోనే జరుగుతున్నాయన్నారు. పరిశ్రమ ప్రహరీ లోపల పైప్‌లైన్ ఉన్నందున రైతులకు ఇబ్బందికరంగా మారుతుందని, అధికారులు గుర్తించి పైప్‌లైన్ స్థలాన్ని వదిలి ప్రహరీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## వరి కోతలో జాగ్రత్తలు తీసుకోవాలి

హత్నూర, నవంబర్ 4: వరి కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సికిందాపూర్‌లో సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం బోర్పట్ల శివారులోని పత్తి కొనుగోలుకేంద్రాన్ని పరిశీలించారు.

## కులగణనపై శిక్షణ

రామచంద్రాపురం: ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్ చంద్రారెడ్డి, పక్కన కమిషనర్ సంగారెడ్డి

ఇంటింటి కుటుంబ సర్వేపై ఉపాధ్యాయులకు సోమవారం ఎంపీడీవో కార్యాలయాల్లో శిక్షణ ఇచ్చారు. ఎన్యుమరేటర్లు దరఖాస్తులు ఎలా నింపాలి, వివరాల సేకరణపై శిక్షణ ఇచ్చారు. కోహీర్ మండలంలోని కవేలి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమగ్ర కుటుంబ సర్వే శిక్షణకు వెళ్లడంతో విద్యార్థులు మధ్యలోనే ఇంటిబాట పట్టారు. ఝరాసంగంలో కులగణనలో తమ కులాన్ని లింగ బలిజగా నమోదు చేయాలని లింగాయత్‌లు కరపత్రాలు ప్రదర్శించారు.

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 4**

## దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

జహీరాబాద్, నవంబర్ 4: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో ఓటు హక్కు కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని జహీరాబాద్ రెవెన్యూ డివిజినల్ అధికారి రాంరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్ఐ శ్యాంరావు ఉన్నారు.

## రక్తదానంతో ప్రాణదానం

రక్తదానం చేస్తున్న రమేశ్

సంగారెడ్డి, నవంబర్ 4: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి రక్తదానం చేసి ప్రాణహాని నుంచి కాపాడాడు ప్రభుత్వ ఉద్యోగి రమేశ్. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న వ్యక్తికి బి నెగిటివ్ రక్తం అవసరమని కుటుంబ సభ్యులు కోరగా కలెక్టరేట్ విధులు నిర్వహిస్తున్న రమేశ్ దవాఖానకు రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రక్తదానం చేయడం ఇది 16వ సారి అని, ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చన్నారు.

## ఆర్‌అండ్‌బీ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్‌గా శ్రీనివాస్

జహీరాబాద్, నవంబర్ 4: జహీరాబాద్ రోడ్డు భవనాల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్‌గా శ్రీనివాస్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏఈ సంధ్య మెదక్‌కు బదిలీపై వెళ్లారు. ఇటీవల ఉద్యోగ భర్తీలో ఏఈగా ఎంపికైన శ్రీనివాస్ జహీరాబాద్ రోడ్డు భవనాల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టారు.

## అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

బొల్లారం, నవంబర్ 4: అంబేద్కర్ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను మున్సిపల్ అధికారులు తక్షణమే పరిష్కరించాలని రెండో వార్డ్ కౌన్సిలర్ గోపాలమ్మ కోరారు. సోమవారం ఆమె బొల్లారంలో మాట్లాడుతూ... గతంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో అంబేద్కర్ కాలనీకి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు కేటాయించి ఐదు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. కాలనీలోని బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన

బొల్లారం, నవంబర్ 4: బొల్లారం మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ నాయకుడు జైపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నాణ్యతా ప్రమాణాలతో చేపడుతూ సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంటన నాయకుడు సంతోష్ రెడ్డి ఉన్నారు.

## బ్యాగులు పంపిణీ

నాగల్‌గిద్ద, నవంబర్ 4: మండలంలోని ముక్తాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం నేవోద్గం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ బాధ్యుడు జయశ్రీ చంద్రశేఖర్‌ను పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శేరికార్ రమేశ్ అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాబుశెట్టి, ఉపాధ్యాయులు లింగమేశ్వర్, సంగమేశ్వర్ ఉన్నారు.

## వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కోహీర్, నవంబర్ 4: మండలంలోని కొత్తూర్(డి) గ్రామంలోని హనుమాన్ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయావరణలో భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు, మాణిక్‌ప్రభు, సంగమేశ్వర్, షఫియొద్దీన్ పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు అంగన్‌వాడీ టీచర్ల వినతి

నారాయణఖేడ్, నవంబర్ 4: అంగన్‌వాడీ టీచర్లకు ఇవ్వాల్సిన బీఎల్‌వో, ఎన్నికల విధులు నిర్వహించిన భత్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు నారాయణఖేడ్ తహసీల్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన విధులకు సంబంధించి డబ్బులు, బీఎల్‌వో విధులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న భత్యాన్ని చెల్లించడంలో పది నెలలుగా జాప్యం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు అర్జున